
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం, 3 ఏప్రిల్ 2024
5





	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	26	40
భద్రాద్రి	28	41



ఇఫ్తార్ : 6:28 (బుధవారం)
సహర్ : 4:39 (గురువారం)



రన్‌లో పాల్గొన్న కలెక్టర్, కేఎంసీ కమిషనర్ తదితరులు

ఉత్సాహంగా 5 కే రన్

- 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో పాల్గొన్న యువత
- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 2: ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ మంగళవారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో నిర్వహించిన 5కె రన్ ఉత్సాహంగా సాగింది. ఈ రన్‌ను జిల్లా కలెక్టర్ వి పి. గౌతమ్ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, యువత భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల్లో అవినీతి అక్రమాలను అరికట్టవచ్చని తెలిపారు. 'అందరం కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు హక్కు వినియోగించుకుంటాం..' అని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 5కె రన్ పోటీలో తొలి 4 స్థానాలలో నిలిచిన విజేతలకు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, శిక్షణ కలెక్టర్‌లు మయాంక్‌సింగ్, యువరాజ్, డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరాం, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి టెన్త్ స్పాట్

- సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 12 వరకు నిర్వహణ
- 2 లక్షల 10 వేల పేపర్ల వ్యాల్యుయేషన్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 2: మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియగా ఒకేషనల్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దీంతో బుధవారం నుంచి జిల్లాలో పదోతరగతి స్పాట్ వ్యాల్యుయేషన్ ప్రారంభం కానున్నది. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి స్పాట్ వ్యాల్యుయేషన్ జరిగే నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. స్పాట్ బుధవారం నుంచి ఏప్రిల్ 12వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పాట్‌కు హాజరుకానున్న ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. ఈ ఏడాది స్పాట్ వాల్యుయేషన్‌లో మొత్తం 2లక్షల10వేల480 పేపర్లు దిద్దనున్నారు. ఇందులో తెలుగు 30,265, హిందీ 32,142, ఆంగ్లం 45,339, గణితం 20,423, జనరల్ సైన్స్ 36,012, బయోలజీ 30,319, సోషల్ 15,980 మొత్తం 2,10,480 వివిధ జిల్లాలకు చెందిన పరీక్షా పేపర్లు వ్యాల్యుయేషన్ చేయనున్నారు. స్పాట్ క్యాంప్ ఆఫీసర్ 1, డిప్యూటీ క్యాంప్ అధికారి1, స్ట్రాంగ్ రూం డిప్యూటీ క్యాంప్ అధికారి1, అసిస్టెంట్ క్యాంప్ అధికారులు 8 మంది, చీఫ్ ఎగ్జామినర్స్ 100 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్స్ 585 మంది, స్పెషల్ అసిస్టెంట్స్ 200 మంది పదోతరగతి స్పాట్ వ్యాల్యుయేషన్‌లో పాల్గొననున్నారు. ఈ స్పాట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

- ఓటర్లకు, సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- ఎన్నికల విధుల్లో పాల్గొనే 10వేల మందికి శిక్షణ
- పోలింగ్ కేంద్రాల్లో అదనంగా మరుగుదొడ్ల నిర్మాణం
- ఈడీ సర్టిఫికెట్లతో ఉద్యోగులు ముందుగానే ఓటేయవచ్చు
- కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్
- పోలింగ్‌కు, కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం

అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వహించిన విధుల అనుభవంతో లోక్‌సభ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేలా, అత్యధిక శాతం ఓటింగ్ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఖమ్మం లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి ఇప్పటి నుంచే కార్యాచరణ సాగుతోందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి కలెక్టర్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



అధిక శాతం పోలింగే లక్ష్యం

ఖమ్మం లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్

ప్రశ్న: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది....ఈనెల 18న నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది... ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి?

జవాబు: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో ముడి పడి ఉంది. ఎన్నికల విధుల్లో పీవోలు, అసిస్టెంట్ పీవోలు, ఇతర సిబ్బంది కలిపి సుమారు పదివేల మందికిపైగా విధుల్లో పాల్గొంటున్నారు. ముందుగా ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెంలో పీవోలు, ఏపీవోలతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. అసెంబ్లీ ఎన్నికలు ఇటీవలనే జరిగినందున ఆ ఎన్నికల్లో పనిచేసిన సిబ్బందే అధికశాతం లోక్‌సభ ఎన్నికల విధుల్లో ఉన్నందున లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ వారికి సులభతరంగానే ఉంటుంది.

ప్ర: అసెంబ్లీ ఎన్నికలు చలికాలంలో జరిగాయి...లోక్‌సభ ఎన్నికలు మండే ఎండల్లో జరగబోతున్నాయి.. పోలింగ్‌పై ఎండల ప్రభావం ఉండే అవకాశం లేదా?

జ: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం. పోలింగ్ రోజున కూల్ వాటర్ ఏర్పాటు, ప్రతి పోలింగ్ గదిలో నాలుగు ఫ్యాన్లు, బయట షామియానాలు ఏర్పాటు చేస్తున్నాం. తక్కువ ఎత్తులో ఉండే భవనాల పైన గ్రీన్‌షేడ్ నెట్స్ ఏర్పాటు చేసి ఎండ వేడి పడకుండా చూస్తాం. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది రాత్రివేళ స్నానం చేయడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈసారి 50శాతం పోలింగ్ కేంద్రాలకు రూ.30వేల చొప్పున అటాచ్డ్ బాత్‌రూం నిర్మిస్తున్నాం. అలాగే మిషన్ భగీరథ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రానికి సంప్ ఏర్పాటు చేసి, మోటర్ ద్వారా ట్యాంక్‌కు ఎక్కించి నీటి సరఫరా సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాల్లో కూర్చునేందుకు బల్లలు, హెల్ప్‌డెస్క్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం.

ప్ర: నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లపై తీసుకుంటున్న చర్యలు?

జ:: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ఈనెల 18న విడుదలవుతుంది. ఆ రోజు నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, అదే రోజు తుది జాబితా ఉంటుంది. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశాం. ఖమ్మం కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతుంది. ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు రూ.95 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చు. నామినేషన్లు డిపాజిట్ కింద జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ , ఎస్టీలు రూ.12,500 డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. పోలింగ్ మైదాన ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మావోయిస్టు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు, వీడియో రికార్డులు ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర: ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఎంతవరకు వచ్చాయి?

జ: మొదటి దశ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఆ తర్వాత లోక్‌సభ నియోజకవర్గం మొత్తం సిబ్బందికి ఒకేసారి శిక్షణ కల్పించబోతున్నాం. ఈసారి ఎన్నికల నిర్వహణలో కొంత మార్పు కూడా తీసుకొచ్చాం. పోలింగ్ అనంతరం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఈవీఎంలను నేరుగా ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీకి తీసుకవచ్చి స్ట్రాంగ్‌రూంలో భద్రపరచడం జరుగుతుంది. ఇందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక కలర్ మార్కింగ్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా ఎవరు ఇబ్బంది పడకుండా ఈవీఎంలు సకాలంలో స్ట్రాంగ్‌రూంకు చేరే అవకాశం కలుగుతుంది.

ప్ర: లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా వివరాల్లో ఏమైనా మార్పులు జరిగాయా?

జ: ఈ నెల 15 వరకు ఓటర్ల మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల చేరిక జరుగుతుంది. మార్చి 15 నాటికి ఖమ్మం పార్లమెంట్ పరిధిలో 16,23,814మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,84,043, మహిళలు 8,39,640 మంది, ఇతరులు 131 మంది, ఎన్ఆర్ఐలు 222, సర్వీసు ఓటర్లు 886మంది ఉన్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో 1896 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం అవకాశం ఉంది.

ప్ర: పోలింగ్ సిబ్బందికి పోస్టల్ ఓటింగ్ ఏర్పాటులో ఏమైనా మార్పులు జరిగాయా?

జ: పోలింగ్ విధుల్లో ఉండే సిబ్బంది, అధికారులు, పోలీసులు, జర్నలిస్టులు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ పోస్టల్ బ్యాలెట్‌ను ముందుగానే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. అయితే ఈసారి పోస్టల్ బ్యాలెట్లకు అంత డిమాండ్ ఉండకపోవచ్చు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లను (ఈడీసీ) ఇస్తున్నాం. ఈసారి సిబ్బంది అంతా లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే విధుల్లో ఉంటున్నందున ఈడీసీ చూపించి ఈవీఎంలోనే ఓటు వేసుకునే అవకాశం ఉంది. ఇతర జిల్లాల్లో నివాసం ఉండి ఇక్కడ ఎన్నికల విధుల్లో ఉంటున్న వారు కూడా ఈడీ సర్టిఫికెట్లు తీసుకొని తమ జిల్లాలకు వెళ్లి మే 4నుంచి 8వరకు ఏర్పాటు చేసే ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయవచ్చు. ఇక మహిళ సిబ్బంది అనువైన పోలింగ్ కేంద్రాల్లోనే విధులు నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

అటు ఆరోపణల జడి.. ఇటు రాబడి...
- ఉమ్మడి జిల్లాలో టాప్‌లో నిలిచిన వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 6

రైతులకు పరిహారం ఇవ్వాలి...
- లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాటం
- ఎంపీలు నామా, వద్దిరాజు 6

త్వరలో పంటల బీమా పథకం



మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యేలతో మంత్రి తుమ్మల సమాలోచనలు

- కేసీఆర్ అసమర్థ పాలనతోనే ప్రజలకు కడగండ్లు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఇల్లెందులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశం
- 6న రాహుల్ సభకు జనసమీకరణపై సమీక్ష
- హాజరైన బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు

ఇల్లెందు, ఏప్రిల్ 2: ప్రకృతి వైపరీత్యాలనుంచి రైతులను ఆదుకునేందుకు త్వరలో పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పదేళ్ల పాటు కేసీఆర్ సాగించిన దుర్మార్గ, అవినీతి, అసమర్థ పాలన మూలంగానే రాష్ట్ర ప్రజలు నేడు అనేక కడగండ్లు, సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. భద్రాద్రి జిల్లా ఇల్లెందులో మంగళవారం మహబుబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. 6వ తేదీన హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బహిరంగసభ విజయవంతాన్ని కాంక్షిస్తూ జన సమీకరణ, లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఎమ్మెల్యేలతో చర్చించారు.

అనంతరం మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి సవ్యంగా లేకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి తన వంద రోజుల పాలనలో అనేక సవాళ్లను అధిగమిస్తూ సోనియమ్మ ఇచ్చిన హామీలతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. తన హయాంలో వానాకాలంలోనూ పంటలకు నీరివ్వలేకపోయిన కేసీఆర్.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వేసవిలో సైతం పంటలకు నీరు అందిస్తున్నా నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి తుమ్మల ప్రకటించారు.

గత ప్రభుత్వ వైఫల్యాలు, లోపాలు సరిచేస్తూ సాగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరింత శక్తివంతం చేసేందుకు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. 6వ తేదీన తుక్కుగూడలోని రాజీవ్‌ప్రాగణంలో జరగనున్న రాహుల్‌గాంధీ బహిరంగసభకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని, కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని తుమ్మల పిలుపునిచ్చారు. అంతకు ముందు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య(ఇల్లెందు), పాయం వెంకటేశ్వర్లు(పినపాక), దొంతి మాదవరెడ్డి(నర్సంపేట), జాటోత్ రాంచంద్రునాయక్(డోర్నకల్), భూక్యా మురళినాయక్(మహబూబాబాద్)తో పాటు తెల్లం వెంకట్రావ్(భద్రాచలం), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుతో సమావేశం నిర్వహించి రాహుల్ సభకు ప్రజల తరలింపు, లోక్‌సభ ఎన్నికల్లో బలరాంనాయక్ గెలుపు కోసం అనుసరించవలసిన వ్యూహాలను మంత్రి తుమ్మల నిర్దేశించారు. కాగా, వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి ఇల్లెందుకు వచ్చిన మంత్రి తుమ్మలకు కాంగ్రెస్ నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు కనగాల పేరయ్య, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియెల్, నాయకులు ఎస్‌కే. జానీ, మూల మధుకర్ రెడ్డి, బిక్కసాని నాగేశ్వరావు తదితరులు మంత్రికి శాలువాలు కప్పి స్వాగతం పలికారు.

మీరేమనుకుంటే అదే.. : ఎమ్మెల్యే తెల్లం



ఇల్లెందులోని ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నిర్వహించిన ఎమ్మెల్యేల సమావేశంలో భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ పరంగా నిర్వహించిన ఈ సమావేశానికి వెంకట్రావు హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. గత మూడు నెలలుగా ఆయన కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జోరుగా సాగుతున్న విషయం విదితమే. ఈ విషయమై ఎమ్మెల్యే వెంకట్రావును 'కాంగ్రెస్‌లో చేరినట్లేనా..?' అని విలేకరులు ప్రశ్నించగా.. తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. 'అయితే కాంగ్రెస్‌లో చేరినట్లే కదా...' అని విలేకరులు ప్రశ్నించగా 'మీరేమనుకుంటే.. అదే' అంటూ ముక్తాయించారు.

ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నగరంలోని టీఎన్‌జీవో ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ వేళ ముస్లింలు భక్తిభావంతో ఉపవాస దీక్షను నిర్వహిస్తారన్నారు. 'ఖమ్మం నియోజకవర్గంలో మీరు ఇచ్చిన ఆశీర్వాదం మరువలేనిది.. ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే ప్రజలంతా అన్ని రంగాల్లో ముందుకు పోవడం సాధ్యమవుతుంది..' అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు జావీద్, నాయకులు మిక్కిలినేని నరేంద్ర, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలకు మంత్రి పండ్లు తినిపించారు. అలాగే ముస్లింలు సామూహిక ప్రార్థనలు జరిపారు.



అగ్గిపడితే బుగ్గే



- బహిరంగ సభల్లో కనీసం ఫైర్‌సేఫ్టీ కరువు
- విచ్చలవిడిగా బాణాసంచా వినియోగం
- గతేడాది ఏప్రిల్‌లో చీమలపాడులో ముగ్గురు బలి
- ప్రస్తుతం ఎన్నికల వేళ సభల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 4,390 అగ్ని ప్రమాదాలు

7

ఎంఈవో, హెచ్‌ఎం సస్పెన్షన్

- పాఠశాల ఆవరణలో జీపీ భవనం నిర్మాణం
- కలెక్టర్ సిఫారసు మేరకు ఆర్జేడీ, డీఈవో చర్యలు

తల్లాడ, ఏప్రిల్ 2: ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మించిన వ్యవహారం ఇద్దరు ఉద్యోగుల మెడకు చుట్టుకుంది. ఖమ్మం జిల్లా తల్లాడ మండల విద్యాశాఖ అధికారి ఎస్.దామోదర్ ప్రసాద్, మల్సూర్‌తండా ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

గతనెల 27వతేదీన తల్లాడ మండలంలో పార్లమెంట్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న పాఠశాలల్లో మౌలిక వసతులు పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సందర్శించారు. ఇందులో భాగంగా మల్సూర్‌తండా ప్రాథమికోన్నత పాఠశాలను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మించి ఉండటాన్ని కలెక్టర్ గమనించారు. పాఠశాల ఆవరణలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎలా అనుమతించారని ఎంఈవో, ప్రధానోపాధ్యాయురాలిని కలెక్టర్ ప్రశ్నించారు. ఇద్దరిపైనా చర్యలకు సిఫారసు చేశారు. ఈ ఎంఈవోను ఆర్జేడీ, ప్రధానోపాధ్యాయురాలిని డీఈవో సస్పెండ్ చేశారు.

జీపీ తీర్మానం మేరకే...

2018వ సంవత్సరంలో మల్సూర్‌తండా కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పాటైంది. 2022వ సంవత్సరంలో ఐటీడీఏ ద్వారా కొత్తగా ఏర్పడిన మల్సూర్‌తండా గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం అధికారులు పరిశీలించగా దొరకలేదు. ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులు మురిగిపోకుండా ఏదోవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారుల సూచించారు.

దీంతో మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ప్రభుత్వ స్థలం కోసం పరిశీలన జరిపారు. ఈ క్రమంలో సుమారు మూడు గుంటల విస్తీర్ణం గల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని కొంత స్థలంలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. అనంతరం ఆ స్థలంలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. అయితే ఈ విషయాన్ని హెచ్‌ఎం గానీ, ఎంఈవో గానీ డీఈవోకు సమాచారం ఇవ్వలేదు. ఈ కారణంపైనే ఇద్దరినీ సస్పెండ్ చేశారు.

రూ.36.90లక్షల నగదు పట్టివేత

ఖమ్మంక్రైం/ మణుగూరు, ఏప్రిల్ 2: ఖమ్మంలో వేర్వేరు ప్రాంతాల్లో రూ. రూ.36.90లక్షల నగదును మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళుతుండటంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో పసుమర్తి శంకర్‌రావు రూ.9లక్షలు, టూటౌన్ ప్రాంతంలో ఉప్పలపాటి శ్రీనివాసరావు నుంచి రూ.1.90లక్షలు, వెలుగు సుధాకర్ నుంచి రూ.6లక్షలు, నున్నా నాగేశ్వరరావు నుంచి రూ.2.50లక్షలు, దొడ్డపనేని శ్రీనివాసరావు నుంచి రూ.8లక్షలు, రాయపూడి రవికుమార్ రూ.9.50లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మణుగూరులో రూ. 6.50లక్షలు..

మణుగూరు కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ. 6.50లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో కోటా వెంకట అప్పారావు అనే వ్యక్తి వద్ద నుంచి రూ.లక్షా యాభై వేలు, ఇట్ట పుల్లారావు అనే వ్యక్తి వద్ద రూ.ఐదు లక్షలను పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండగా వాటిని సీజ్ చేశామన్నారు. ఈ నగదు మొత్తాన్ని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

80లోనూ వన్నె తగ్గని మద్దినేని..



బాల్‌బ్యాడ్మింటన్ కోర్టులో ప్రసాదరావు

- బాల్‌బ్యాండ్మింటన్ ఆడుతున్న ప్రసాద్‌రావు
- వయస్సు పెరిగినా వన్నె తగ్గని క్రీడాకారుడు
- ఎనిమిది పదుల వయస్సులోనూ నిత్యం ప్రాక్టీస్
- స్టేడియంలో ఇప్పటికీ ప్రధాన ఆటగాడు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 2: సాధారణంగా మనిషికి 60 సంవత్సరాల వయస్సు రాగానే కంటి చూపు మందగించడం, వినికిడి సమస్యలు, మోకీలు, కీళ్ల నొప్పులు, సయాటికా, బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలికంగా వేధించే రకరకాల వ్యాధుల భారిన పడుతుంటారు. ఇక 60 ఏళ్ల పైబడగానే మిగితా శేష జీవితాన్ని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలనుకుంటారు. కానీ ఖమ్మం నగరానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం మద్దినేని ప్రసాదరావు దానికి భిన్నంగా ఎనిమిదిపదులు వచ్చినా తనలో వన్నె తగ్గలేదని నిరూపిస్తున్నారు. వయస్సు పెరిగిందనే ఆలోచనే లేకుండా తన 15వ ఏట సరదాగా మొదలు పెట్టిన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను ఇప్పటికీ ఉత్సాహంతో పరుగులు పెడుతూ ఆడుతుండటం విశేషం. నిత్యం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని బాల్ బ్యాడ్మింటన్ కోర్టులలో ఇప్పటికీ అతనే ప్రధాన ఆటగాడు. మ్యాచ్‌లు ఆడాలన్నా, ప్రాక్టీస్ చేయాలన్నా ఉరిమే ఉత్సాహం ఆయన సొంతం. ఆయన ఆడే ఆట చూపరులను ఆకట్టుకుంటుంది. భావి క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్న మద్దినేని ప్రసాదరావును పలువురు అభినందిస్తున్నారు.

వయస్సు పెరిగినా వన్నె తగ్గని ప్లేయర్

వయస్సు పెరిగిందన్న ఆలోచన తనకు లేదన్న మద్దినేని ప్రసాదరావు 1944లో ఏన్కూరు మండలం జన్నారం గ్రామంలో ఓ రైతు కుటుంబంలో జన్మించాడు. తనకు 15వ ఏట సరదాగా పాఠశాలలో బాల్‌బ్యా డ్మింట న్ బ్యాటు పట్టుకున్న ఆయన ఇప్పటికీ ఆ బ్యాటు ను, క్రీడను వదిలిపెట్టలేదు. సుమారు 65 సంవత్సరాలుగా ప్రతీ రోజూ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను ఆడుతుండటం విశేషం. అంతే కాకుండా పలు రాష్ట్ర, జాతీయ పోటీలలో పాల్గొని పలు పతకాలు సాధించాడు.



బాల్‌బ్యాడ్మింటన్ అంటే నాకు ప్రాణం

మద్దినేని ప్రసాదరావు, వెటరన్ క్రీడాకారుడు

ఇప్పటికీ, ఎప్పటికీ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడ అంటే నాకు చాలా ఇష్టంతో పాటు నాకు ప్రాణం. ఓపిక ఉన్నంత వరకు ఆడుతా. ప్రతీ రోజూ ఆ క్రీడ ఆడకపోతే మనసు బాగోదు. బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. జూనియర్ క్రీడాకారులు బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను చిన్నతనం నుంచే నేర్చుకోవాలి.

జూనియర్లకు ఆదర్శంగా..

65 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో ఎంతో మంది జూనియర్ క్రీడాకారులకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆటలోని మెళకువలు, రాష్ట్ర, జాతీయ పోటీలలో పాటించాల్సిన విధానాలను జూనియర్ క్రీడాకారులకు వివరిస్తూ పోటీలో ఎలా నెగ్గాలనే అంశాలపై నైపుణ్యంతో సలహాలు ఇస్తుంటారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా జిల్లాలో ఆయన పనిచేసి న పందిళ్లపల్లి, రాంపురం, రేపల్లెవాడ, కొత్తగూడెం, పాల్వంచ, తెల్దారుపల్లి, తల్లంపాడు, రఘునా థపాలెం, ఇందిరా నగర్, చిమ్మపూడి తదితర గ్రామాలకు చెందిన పూర్వవిద్యార్థులు ఆయనను కలిసి ఇప్పటికీ ఆటలోని మెళకువలు నేర్చుకుంటారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- అనంతారంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు

జూలూరుపాడు, ఏప్రిల్ 2: అనంతారం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయహస్త వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. గురువారం మండలంలోని అనంతారం గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అనంతారంలో గత నెల 31 నుంచి ఈ నెల 4 వరకు ప్రతిష్ఠ మహోత్సవ పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో మంగళవారం ఆయన అనంతారం గ్రామాన్ని సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామస్థులు వద్దిరాజుకు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని నాభిశిల వద్ద ఆయన పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాపట్ల మురళి, నాయకులు రామిశెట్టి రాంబాబు, శిరంశెట్టి రామరావు, పెంటికల వీరబాబు, మల్లెల నాగేశ్వరరా వు, ఆలయ కమిటి సభ్యులు బండారు వెంకయ్య, ఉసికల వెంకటేశ్వర్లు, పుల్లారావు, శ్రీను, నరసింహారావు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న వద్దిరాజు

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు వ్యాహిత

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 2: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సత్నాలో ఈనెల 11 నుంచి 14 వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి అండర్- 14 స్కేటింగ్ పోటీలకు ఖమ్మం నగరంలోని సెయింట్‌జోసఫ్ పాఠశాల విద్యార్థిని ఇనపనూరి వ్యాహిత ఎంపికైంది. వ్యాహిత ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ నక్షత్ర తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వ్యాహితను పాఠశాల అధ్యాపకులు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నక్షత్ర

రైతులకు పరిహారం ఇవ్వాలి..

- లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాటం
- ఎంపీలు నామా, వద్దిరాజు

ఖమ్మం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నీళ్ల లేక పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి రూ.25వేలు పరిహారం అందించాలని లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరావు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం బీఆర్ఎస్ లోక్‌సభ నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, మదన్‌లాల్, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణచైతన్యతో పాటు పలువురు జడ్పీటీసీలు, మండల పార్టీ నాయకులు కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా ఎంపీ నామా ప్రసంగిస్తూ రైతులకు ప్రభుత్వం సత్వరం పంటల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు పరిహారం ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు సందర్భంగా క్వింటాకు రూ.500బోనస్ తక్షణం చెల్లించాలన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో తాగు, సాగునీటి సమస్య గతంలో ఎన్నడు లేని విధంగా ఉందని, ఈ సమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టే పరిస్థితి లేదని నామా పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు మాట్లాడుతూ జిల్లాలో పంటలు పెద్దఎత్తున రైతులు కోల్పోయారని, వరి, మొక్కజొన్న పంటలకు అధిక నష్టం జరిగిందని, నష్టంపై వెంటనే సర్వే చేసి రైతులకు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి నాయకులు మంకెన రమేష్, బెల్లం వేణు, పలు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గైర్హాజరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరుకావాలి: కలెక్టర్ ప్రియాంక, ఖమ్మం కలెక్టర్ గౌతమ్

కొత్తగూడెం కలెక్టరేట్/ ఖమ్మం కలెక్టరేట్ ఏప్రిల్ 2: ఎన్నికల విధులు కేటాయిస్తే శిక్షణ తరగతులకు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన 48మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను జిల్లా ఎన్ని కల అధికారి డాక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఎన్నికల శిక్ష ణా కార్యక్రమాలు రెండో రోజైన మంగళవారం ఆమె పాల్వంచలోని డిగ్రీ కాలేజీలో భద్రాచలం నియోజకవర్గం ఎన్నికల సిబ్బంది శిక్షణా కార్యక్రమాన్ని ఆకస్మిక తనికి చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో మొత్తం 1233 మందికి ఎన్నికల విధులు కేటాయిస్తే వారిలో 1,185 మంది మాత్రమే హాజరయ్యారని, 48మంది గైర్హాజరయ్యారన్నారు. శిక్షణ తరగతుల్లో ఈవీఎం పరికరాల పనితీరును పీవో, ఏపీవోలను అడిగి తెలుసుకొన్నారు. పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా పోలిగ్ రోజున పూర్తిచేయాల్సిన 17సీ, పీవో డైరీ, పీవో రిపోర్టులతో పాటు ఈవీఎం కనెక్షన్ మీద స్పష్టమైన అవగాహన కల్గిఉండాలన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెంలో 275 మంది, అశ్వారావుపేటకు 264, పినపాకకు 260, భద్రాచలానికి 209, ఇల్లెందుకు 225 మంది మొత్తం 1,233 మందికి కాను 1,185 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, భూమి కొలతలశాఖ అధికారి కుసుమకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, భద్రాచలం తాహసిల్దార్ శ్రీనివాస్, పాల్వంచ తహసిల్దార్ వివేక్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



ప్రిసైడింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్: ఖమ్మం త్రీ టౌన్‌లోని ప్రభుత్వ మహి ళా డిగ్రీ కళాశాలలో ఖమ్మం పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణా తరగతులను కలెక్టర్ వీపీ గౌతమ్ మంగళవారం పరిశీలించారు. వివరాలను అడిగితెలుసుకు న్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనిలు ఎన్ని కల విధులకు హాజరైన సిబ్బందికి ఇస్తున్న శిక్షణను సద్విని యోగించుకోవాలన్నారు. పోలింగ్ రోజున సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని, విధులలో ఏ మాత్రం అలక్ష్యంగా ఉండొద్దని కలెక్టర్ గౌతమ్ సూచించారు.

16న ఖమ్మం జిల్లా న్యాయవాద సహకారసంఘం ఎన్నికలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్ 2: ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్లో 16న ఖమ్మం జిల్లా న్యాయవాద సహకారసంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి గుద్దేటి రమేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి కొప్పుల రవికుమార్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నామినేషన్లను ఈ నెల 4వతేదీ నుంచి 6వతేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దాఖలుచేసుకోవచ్చన్నారు. ఫైనల్ లిస్ట్ 10న ప్రకటిస్తామని, పోలింగ్ 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు జరుగుతుందని, కౌంటింగ్ ప్రక్రియ అదేరోజు సాయంత్రం 3 గంటల నుంచి ప్రారంభిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

బీజేపీ విజయం కోసం శ్రమించాలి

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్ 2: ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు విజయం కోసం ప్రతీ కార్యకర్త శ్రమించాలని, సోషల్ మీడియా వేదికగా జనం రద్దీగా ఉండే ప్రదేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి చర్చించాలని, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జిల్లా శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. అనంతరం గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రం జిల్లాకు జాతీయ రహదారుల కోసం సుమారు రూ.1200కోట్లు కేటాయించిందన్నారు. అనంతరం సంక్షేమపథకాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కార్పొరేట ర్ డి.సత్యనారాయణ, శ్యామరాథోడ్, వెంకట్, పాల్గొన్నారు.

మ్యుటేషన్ల ఇబ్బందులు

- పేరు మార్పిడిలో తీవ్రజాప్యం
- కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ బాధితులు



ఖమ్మంకార్పొరేషన్, ఏప్రిల్ 2: ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో మ్యుటేషన్ ప్రక్రియలో తీవ్రజాప్యం జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు, ఇతర ఆస్తులు అమ్మినప్పుడు కొనుగోలు చేసిన వారిపేరును నగర పాలకసంస్థ రికార్డుల్లో నమోదు చేయాలి. అప్పుడే కొనుగోలు చేసినవారికి యాజమాన్య హక్కులు వస్తాయి. అయితే ఇలా పేరు మార్పిడి (మ్యుటేషన్) చేయటం లో తీవ్రజాప్యం చేస్తున్నారు. దీంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాగానే మ్యుటేషన్ కింద రూ.3వేలు వసూలు చేస్తారు. సదరు నగదును స్టాంప్‌డ్యూటీ కింద నగరపాలకసంస్థకు జమ చేస్తారు. ఇలా సొమ్ములు చెల్లించినప్పటికీ పేరు మార్పులో జాప్యం జరగటంతో సదరు వ్యక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుమార్పు(మ్యుటేషన్) చేయాలని నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ పేర్లను మార్చటం లేదు.

మ్యుటేషన్ కాకపోవటంతో..

ఆస్తిని కొనుగోలు చేసినప్పటికీ మ్యుటేషన్ జరిగి తమ పేరు మార్చకపోవటంతో అనేక ఇబ్బందు లు ఎదురవుతున్నాయి. నగరపాలకసంస్థ రికార్డుల్లో నమోదు అయితేనే కరెంట్‌మీటర్‌లో, అలాగే ఆస్తిపన్నులు, పంపుప న్నుల్లో కూడా పేరుమారుతుంది. ముఖ్యంగా బ్యాంక్‌రుణాలు తీసుకునేవారికి మ్యుటేషన్ జరిగితేనే రుణాలు ఇస్తారు. ఇలా పలు పనులకు మ్యుటేషన్ తప్పనిసరి. అయితే పేరు మార్పులో తీవ్రజాప్యం జరగటంతో కొనుగోలు చేసినా పాత యజమాని పేరే ఉండటంతో ఇబ్బందు లు తప్పటం లేదు.

నగరపాలకసంస్థ పరిధిలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఒక వ్యక్తి ఇంటిని కొనుగోలు చేసినప్పటికీ పాత యజమాని పేరును నగరపాలకసంస్థ రికార్డుల్లో తొలగించకపోవటంతో సదరు యజమాని కొనుగోలుచేసిన వ్యక్తిని తీవ్ర ఇబ్బందుల కు గురిచేస్తున్నాడు. ఆస్తిపన్నుల డిమాండ్ అమ్మిన వ్యక్తి పేరుమీదనే రావటంతో కొనుగోలు చేసిన వ్యక్తి తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. అలాగే మరొక వ్యక్తి 54గజాల స్థలంలో ఉన్న ఇంటిని కొనుగోలు చేసి, ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు మ్యుటేషన్ జరగలేదు. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నప్పటికీ పేరుమార్పు కాకపోవ టంతో నగర పాల కసంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

100కు పైగా పెండింగ్

నగరపాలకసంస్థలో మ్యుటేషన్ ఫైళ్లు 100కు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ కాగానే సదరు డాక్యుమెంట్లను ఆర్ఐకు ఇవ్వాలి. ఆర్ఐ లాగిన్‌నుంచి కమిషనర్ లాగిన్‌కు వెళతాయి. కమిషనర్ డిజిటల్ సంతకం పెట్టిన తరువాత పేరుమార్పు (మ్యుటేషన్) జరుగుతుంది. అయితే ఆర్ఐలకు వివిధ పనులు కేటాయించటంతో లాగిన్‌లో నమోదు చేయలేకపోతున్నారు. ఆన్‌లైన్ చేసినా కమిషనర్ లాగిన్‌లోకి పంపటం లేదు. అలాగే ఎన్నికల విధులు, కలెక్టర్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొనటం తదితర పనులతో కమిషనర్ బిజీగా ఉండటంతో లాగిన్‌ను చూడలేకపోతున్నారు. ఫలితంగా మ్యుటేషన్‌లు పెండింగ్‌లో ఉంటున్నాయి.

అటు ఆరోపణల జడి.. ఇటు రాబడి..

- ఉమ్మడి జిల్లాలో టాప్‌లో నిలిచిన వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం
- 2023-24లో రూ.13.57 కోట్ల ఆదాయ ఆర్జన
- ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం
- వివిధ ఆరోపణలతో ఇప్పటికే పలువురిపై చర్యలు

వైరా, ఏప్రిల్ 2: భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ఇటీవల వివాదాల్లో చిక్కుకున్న వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆదాయంలో ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి తన ప్రత్యేకతను చాటుకున్నది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఈ కార్యాలయాన్ని చుట్టుముట్టాయి. గత రెండేళ్ల నుంచి ప్రతినిత్యం ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వార్తల్లో నిలుస్తోంది. ఇవన్నీ ఎలా ఉన్నప్పటికీ ఈ కార్యాలయం గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మంజిల్లాలోనే అత్యధికంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చింది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా ఒక్క వైరాలోనే లక్ష్యానికి మించిన రాబడి ప్రభుత్వానికి లభించింది. మిగిలిన పది కార్యాలయాల కంటే వైరా కార్యాలయం మాత్రమే లక్ష్యానికి మించి రూ.1.45 కోట్లు ఆదాయాన్ని రాబట్టింది. వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 4350 డాక్యుమెంట్లతో రూ.12.12 కోట్లు ఆదాయాన్ని సమకూర్చగా, 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మాత్రం 4474 డాక్యుమెంట్లతో రూ.13.57 కోట్లు ఆదాయాన్ని గడించింది. గత ఆర్థిక సంవత్సరానికి ఇప్పుడు ముగిసిన ఆర్థిక సంవత్సరానికి మధ్య 124 డాక్యుమెంట్లు పెరిగాయి. ఆదాయం రూ.1.45 కోట్లు అధికంగా రాబట్టింది. ఇక ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మిగిలిన పది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు లక్ష్యం మేరకు ఆదాయం కానీ, డాక్యుమెంట్లను కానీ రాబట్టలేకపోయాయి. పది కార్యాలయాలు కూడా డాక్యుమెంట్లు, ఆదాయంలో వెనుకబడిపోయాయి.

2022 జనవరి వరకు ఈ కార్యాలయం పాత బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ భవనంలో నడిచింది. అయితే భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రికార్డులు, కంప్యూటర్ల నిర్వహణ ఇబ్బందికరంగా ఉందనే కారణంతో వైరా కుడి కాల్వ ప్రధాన లాకుల సమీపంలోని మరో ప్రైవేట్ భవనంలోకి మార్చారు. ఇక అప్పటి నుంచి ఈ కార్యాలయం నిత్యం అవినీతి అక్రమాల ఆరోపణలతో వివాదాస్పదంగా మారింది. ప్రస్తుత భవనంలో ఉన్న కొద్దిరోజులు మాత్రమే రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌గా అంకం కృష్ణయ్య పనిచేశారు. ఆయన బదిలీపై వెళ్లిన తర్వాత ఇప్పటివరకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ ఈ కార్యాలయానికి రాలేదు. సీనియర్ అసిస్టెంట్లుగా ఉన్న వారికే ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలను కట్టబెడుతున్నారు.

కృష్ణయ్య స్థానంలో మధిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సదానందంను వైరా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయనపై మధిరలో వచ్చిన ఫిర్యాదులతో సస్పెండయ్యారు. ఆ తర్వాత ఖమ్మం హెడ్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామ్‌కుమార్‌ను వైరా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. అయితే మునిసిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా కన్వర్షన్ కాపి లే అవుట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేశారని వచ్చిన ఆరోపణలపై ఆయనను ఇక్కడ విధుల నుంచి తప్పించారు.

ఆ తర్వాత ఆయన స్థానంలో ఖమ్మం హెడ్ ఆఫీసులోని సీనియర్ అసిస్టెంట్ అయిన మోహిద్ అలీని వైరా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. గత ఏడాది డిసెంబరులో ఆయనపై కూడా పలు ఫిర్యాదులు, ఆరోపణలు రావడంతో వైరా నుంచి తప్పించి జిల్లా హెడ్ ఆఫీసులోని యథాస్థానంలో నియమించారు. ఆయన స్థానంలో ప్రస్తుత ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ కరుణను నియమించారు. ఆమె ఖమ్మం హెడ్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్నారు. గతంలో వైరాలో కూడా కొన్నినెలలపాటు పనిచేశారు. ఆమె సీనియర్ అసిస్టెంట్ హోదాలోనే ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసే సమయంలో వచ్చిన ఆరోపణలతో సస్పెండయ్యారు. ఆమెను గత డిసెంబరులో వైరా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

అయితే కొన్నినెలల నుంచి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గిరిజన ప్రాంతమైన ఏన్కూరు మండలంలో 1/70 యాక్టు అమలులో ఉన్నప్పటికీ పార్టీషన్ పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ విచారణ చేసి వరంగల్ డీఐజీ సుభాషిణికి ప్రాథమిక నివేదిక ఇచ్చారు. నివేదిక మేరకు బదిలీ ఉత్తర్వులు సిద్ధం కాగా, ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల అండదండలతో బదిలీని ఆపుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.



వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

భారీగా పెరిగిన పామాయిల్ గెలల ధర

- టన్ను గెలలు రూ.14,174గా నిర్ణయం

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 2: పామాయిల్ గెలల ధరను మార్చినెలకు భారీగా పెంచుతూ ఆయిల్‌ఫెడ్ అధికారులు సోమవారం ఆదేశాలు ఇచ్చారు. ఫిబ్రవరి నెలలో టన్ను గెలల ధర రూ.13,135గా ఉండగా మార్చి నెలకు రూ.1039 పెంచి రూ.14,147గా నిర్ణయించారు. ఈమేరకు పెరిగిన పామాయిల్ గెలల ధరను ఆయిల్ ఫెడ్ సీనియర్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి వివరించారు. గెలల ధర పెరగటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది.

ఆళ్లపల్లి సమస్యలు పరిష్కరించండి

- మంత్రి తుమ్మలకు కాంగ్రెస్ నాయకుడు అతహర్ వినతి

ఆళ్లపల్లి, ఏప్రిల్ 2: ఆళ్లపల్లి మండలంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ అతహర్ విజ్ఞప్తి చేశారు. ఇల్లెందులో మంగళవారం జరిగిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మలను ఆయన కలిశారు. ఆళ్లపల్లి మండలంలోని ప్రధానంగా ఉన్న సమస్యల్లో మామకన్ను- ఆళ్లపల్లి మధ్య కిన్నెరసానిపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జీ నిర్మాణ పనులు, మర్కోడు- రేగళ్ల రోడ్డు, ఆళ్లపల్లి నుండి అనిశెట్టిపల్లి వరకు డబుల్‌రోడ్డు, ఇల్లెందు నుంచి మర్కోడుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం, ఆళ్లపల్లి సెంటర్ నుంచి అంగన్‌వాడీ వరకు సీసీ రోడ్డు సమస్యలపై తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి తుమ్మల సానుకులంగ స్పందించారు. తుమ్మల మాట్లాడుతూ ఆళ్లపల్లి మండలానికి వెళ్లితే అన్నం పెట్టే నాయకుడు మహ్మద్ అతహర్ అని ఆయనను కొనియాడారు. త్వరలో ఆళ్లపల్లి మండలం వస్తానని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పొదెంవీరయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను అతహర్ కలిశారు. ఆళ్లపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు మంత్రి తుమ్మలను మర్యాద పూర్వకంగా కలిశారు.



మంత్రి తుమ్మలతో అతహర్

పాయాపూరు చెరువు ఆక్రమణపై కలెక్టర్ సీరియస్

- సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- రెండోసారి సర్వేచేసిన జలవనరుల శాఖ అధికారులు
- సర్వేపై రైతులు, సొసైటీ సభ్యుల అనుమానం

కల్లూరు, ఏప్రిల్ 2: కల్లూరు మండలంలోని పాయాపూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని పెద్దచెరువు శిఖం భూమి ఆక్రమణపై జిల్లా అధికారులు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో చెరువు శిఖం భూమిని ఆక్రమించినట్లు కథనాలు వెలువడ్డాయి. దీనిపై ఈ చెరువు పరిధిలో గల ఆయకట్టు రైతులు అధికారులకు సమాచారం అందించగా చెరువు శిఖం, బఫర్ జోన్ పరిధిలో గల భూమిపై డీఈ రత్నాకర్ తన సిబ్బందితో చేరుకుని మట్టి తోలకాలతో పాటుగా మెరక భూమిగా మార్చే ప్రక్రియను అడ్డుకున్నారు.

ఇంకాను చెరువు పరిధిలోని 50 ఎకరాల భూమిని పది మంది వ్యక్తులు గత ఎనిమిది సంత్సరాల క్రితం నాటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై సగటున ఒక్కక్కరు 5 ఎకరాల భూమిని తమ పేరున పట్టా చేయించుకుని పాస్‌పుస్తకాలు కూడా పొందారు. నాటి నుంచి రైతుబంధు సహాయం పొందుతున్నారని సమాచారం. చెరువు భూమి ఆక్రమణ విషయంలో కలెక్టర్ అధికారు లపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. కల్లూరు మండల రెవెన్యూ జలవనరులశాఖ అధికారు లకు చెరువుపై సమగ్ర సర్వే చేసి నివేదిక పంపమని ఆదేశించారని తెలిసింది. ఆ క్రమంలో గత శనివారం ముందస్తుగా రెవెన్యూ జనలనరులశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి చెరువు విస్తీర్ణం హద్దులు గుర్తించారు. మంగళవారం జలవనరులశాఖ కల్లూరు సబ్‌డివిజన్ డీఈ రత్నాకర్ తమ సిబ్బందితో సదరు చెరువు ప్రదేశంపై చేరుకుని మలివిడతగా సర్వే చేశారు. చెరువు అలుగు ను ప్రామాణికంగా తీసుకొని ఎఫ్‌టీఎల్ సామర్థ్యం శిఖం భూమిని గుర్తించి హద్దులు గుర్తించామని డీఈ తెలిపారు. రెండు శాఖల సంయుక్త నివేదికల ఆధారంగా జిల్లా అధికార యంత్రాంగం తగిన విధంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మరో 15 ఎకరాల ఆక్రమణకు సన్నాహాలు..

ఈ చెరువు పరిధిలో గల మరో 15 ఎకరాల మునక భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించ టమే కాకుండ మ ట్టి తోలకాలు జరిపి సాగు వినియోగంలోకి తెచ్చేందుకు మెరక భూమిగా తయారు చేసుకుంటున్నారు. భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకొని చెరువును రక్షించాలని రైతులు కోరుతు న్నారు.

సర్వేపై సొసైటీ సభ్యులు, రైతుల అనుమానాలు..

ఈ చెరువు ప్రదేశంపై అధికారులు చేపడుతున్న సర్వేపై అయకట్టు రైతులు, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కోటా రాములు, సభ్యులు కారుమంచి శ్రీను, నున్నావత్ జగ్యా, గుగులోత్ రాములు, లాలు, వీరన్న తదితరులు అనుమానం వ్యక్తం చేశారు. వారు విలేకరులతో మాట్లాడు తూ చెరువు ప్రదేశంపై ఆక్రమణకు గురియైన భూమిని వదిలివేసి అధికారులు సర్వే చేయంటం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. ఇప్పటికైన జిల్లా అధికారులు ఈ చెరువు భూమి ఆక్రమణపై సమగ్రంగా దృష్టి సారించి అయుకట్టు రైతుల సమక్షంలో బహిరంగ సర్వే చేసి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అగ్గిపడితే బుగ్గే

» బహిరంగ సభల్లో కనీసం ఫైర్‌సేఫ్టీ కరువు » గతేడాది ఏప్రిల్‌లో చీమలపాడులో ముగ్గురు బలి

» గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 4,390 అగ్ని ప్రమాదాలు » ప్రస్తుతం ఎన్నికల వేళ సభల్లో జాగ్రత్తలు తప్పనిసరి

అదొక బీభత్స దృశ్యం.. సరిగ్గా ఏడాది క్రితం ఓ రాజకీయ సమావేశం సందర్భంగా కొందరి అత్యుత్సాహం, మరికొందరి నిర్లక్ష్యం పలువురి ప్రాణాలు తీసింది. మరోకొందరిని జీవచ్ఛవాలుగా మార్చింది. ఒకచిన్నపాటి నిప్పురవ్వ పెను విధ్వంసాన్ని సృష్టించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి అధికారపార్టీ బీఆర్‌ఎస్ కారేపల్లి మండలంలోని చీమలపాడులో ఏర్పా టు చేసిన ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా.. కొందరు బాణాసంచా కాల్చడంతో ఓ నిప్పురవ్వ సమీపంలోని ఓ పూరిల్లుపై పండి మంటలు చెలరేగడంతో వాటిని ఆర్పుతుండగా ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి పలువురు మృతి చెందారు. నడివేసవిలో జరిగిన ఈ ఘటన బహిరంగ సభలు, సమావేశాల సందర్భంగా నిర్లక్ష్యం వహిస్తే ఏం జరుగుతుందో చెప్పడానికి ఓ ఉదాహరణగా నిలిచింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు కూడా వేసవిలోనే జరుగుతుండడంతో రాజకీయ పార్టీలు సభలు సమావేశాలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవశ్యం.



మంటలను ఆర్పుతున్న పోలీసులు, స్థానికులు (ఇన్‌సెట్‌లో ప్రమాదంలో గాయపడిన వ్యక్తి)(ఫైల్)

ఖమ్మం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో సభలు జరుగుతున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనూ సభలు, సమావేశాలు భారీగానే నిర్వహించే అవకాశం ఉంది. ఆయా సభలకు వేలసంఖ్యలో జన సమీకరణ చేసే అవకాశం ఉంది. అయితే సభలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు, ఆయా సభల వద్ద ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సభలకు హాజరైన వారికోసం భోజనాలు అందించాలన్న ఉద్దేశంతో వంటల ఏర్పాట్లు కూడా సభాప్రాంగణానికి దగ్గర్లోనే



అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. గతేడాది చీమలపాడు ఆత్మీయ సమ్మేళనంలో వేదిక వద్ద ఫైర్‌సేఫ్టీ యంత్రాలు ఉండి ఉంటే.. గుడిసెకు మంటలు అంటుకున్న వెంటనే వాటిని ఆర్పి ఉండేవారన్న వాదన వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో నిర్వహించే ఏ సభలోనూ ఫైర్‌సేఫ్టీకి సంబంధించిన చిన్నపాటి సిలిండర్‌లు కానీ, ఇసుక బకెట్లు కానీ, వాటర్ డ్రమ్ములు కానీ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. అధికారులైతే అసలు ఆ కోణంలో నిర్వాహకులకు సూచనలు కూడా చేయడం లేదన్న విమర్శలూ ఉన్నాయి.

విచ్చలవిడిగా బాణసంచా

ప్రస్తుతం ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా బాణాసంచావినియోగించడం పరిపాటిగా మారింది. రాజకీయ ర్యాలీల్లో అయితే అడ్డూ అదుపూ లేకుండా వినియోగిస్తుంటారు. గతేడాది చీమలపాడు ఘటనకు బాణాసంచానే కారణం. జిల్లాలో ఎలాంటి లైసెన్స్ లేకుండానే అనేకమంది సంవత్సరం మొత్తం బాణాసంచా విక్రయాలు సాగిస్తున్నారు. సంవత్సరం మొత్తంలో లైసెన్స్ కలిగిన విక్రయదారులు ఎంతమొత్తంలో బాణసంచా విక్రయిస్తారో దానికి మూడింతలు అనధికారికంగా విక్రయాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. అధికారులు మాత్రం కేవలం దీపావళి మూడు రోజులపాటు తనిఖీలు చేసి మిగిన రోజుల్లో దాని గురించే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

బహుళ అంతస్థుల్లోనూ నిల్..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం నగరంతో పాటు అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో నిర్మించిన బహుళ అంతస్తుల్లో ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లాలోని అత్యధికశాతం అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలల భవనాలకు అగ్రిమాపక వాహనం చేరుకునే పరిస్థితి లేదు. జిల్లాలో భారీ భవంతులు వందల సంఖ్యలోనే ఉన్నాయి. రెండు జిల్లాల్లో వెయ్యికి పైగానే ఆసుపత్రులు, సుమారు 700వరకు కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. వీటిన్నింటిలోనూ దాదాపు మొక్కుబడిగానే ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇక ఫంక్షన్ హాళ్లలో పేరుకే ప్రమాణాలు పాటిస్తారన్న విమర్శలున్నాయి.

అవగాహన కల్పిస్తున్నా..

ప్రతీయేటా అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అగ్నిప్రమాదాలను నివారించలేకపోతున్నారు. ప్రమాదం జరిగితే తక్షణం చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు బాధితులకు సూచనలు చేస్తున్నా ప్రతి సంవత్సరం 700కు పైగా అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సరైన ప్రమాణాలు పాటించకపోవడమే దానికి కారణంగా కనిపిస్తోంది. గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,390 ప్రమాదాలు జరిగాయి. రూ.69.42కోట్ల ఆస్తి నష్టం జరిగింది. 131మంది ప్రాణాలను కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సభలు, సమావేశాలు వంటి జనసమూహాలు ఉండే ప్రాంతాల్లో ఖచ్చితంగా ఫైర్‌సేఫ్టీ పాటించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తగూడెం జిల్లా

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తినష్టం (రూ. కోట్లలో)	కాపాడిన ఆస్తి (రూ. కోట్లలో)	ప్రాణనష్టం	కాపాడిన ప్రాణాలు
2018	350	3.34	11.28	3	12
2019	353	2.03	9.28	5	16
2020	287	2.06	32.20	15	34
2021	211	2.32	25.49	10	90
2022	353	2.16	11.69	09	53
2023	282	2.62	14.95	13	67
మొత్తం	1836	14.53	104.89	55	272

ఖమ్మం జిల్లా వివరాలు...

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తినష్టం (రూ. కోట్లలో)	కాపాడిన ఆస్తి (రూ. కోట్లలో)	ప్రాణనష్టం	కాపాడిన ప్రాణాలు
2018	426	4.81	31.92	7	9
2019	459	2.95	21.50	14	55
2020	442	36.70	2.0	25	17
2021	332	2.52	12.41	8	23
2022	396	3.01	15.52	09	20
2023	499	4.90	102.2	13	74
మొత్తం	2554	54.89	185.55	76	198

తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య

కామేపల్లి, ఏప్రిల్ 2: తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామేపల్లి మండలం గోవింద్రాలలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గోవింద్రాల గ్రామానికి చెందిన భూక్య మధు(17) ఇంట్లో ఏం పని చేయకుండా ఉండడంతో తల్లి బుచ్చి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మనస్తాపానికి గురై ఆటో డ్రైవర్ ...

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 2: మనస్తాపానికి గురై ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని ముస్తఫానగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ముస్తఫానగర్‌లో నివసించే యల్లబోయిన ఉపేందర్(32) ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో ఘర్షణలు పడుతుండడంతో భార్య నీలిమ తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మంగళవారం ఉదయం అతడి భార్య ఇంటికి రాగా మృతి చెంది ఉండటాన్ని గుర్తించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక వివాహిత...

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 2: వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఖమ్మం నగరంలో జరిగింది. నగర పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన గుమ్మడిల్లి కోటేశ్వరరావు కుమార్తె గిరిజ(22)కు టూటౌన్ ప్రాంతంలో ఉండే శరత్‌చంద్రతో కొంతకాలక్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులుగా భర్త, అతని కుటుంబ సభ్యులు గిరిజను వేధిస్తూ ఉండటంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

70 లీటర్ల నాటు సారా పట్టివేత

బూర్గంపాడు/ మణుగూరు, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని సారపాక లో మంగళవారం ఏఈఎస్ తిరుపతి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్ మెంట్ ఖమ్మం టీమ్ జరిపిన దాడుల్లో 70 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. ఈ సారాను ఆటోలో ఆంధ్రప్రదేశ్‌లో గుండువారి గూడెం గ్రామాలకు చెందిన మాలోత్ హచ్చీ, భూక్యా సక్కు, ఆటో డ్రైవర్ గుగ్లోత్ రవి, జర్కుల సురేష్‌లు తరలిసుండగా సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పట్టుబడ్డవారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మొబషీర్ అహ్మద్, కానిస్టేబుల్ కరీం సిబ్బంది సుదీర్, హరీష్, హనుమంత రావులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెల మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 2: వీధి కు క్కలు దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని కాకరవాయి గ్రామంలో జరిగింది. కాకరవాయి గ్రామానికి చెందిన పచ్చిపాల నాగయ్యకు చెందిన గొర్రెల మందపై మంగళవారం వీధికుక్కలు దాడి చేశాయి. ఈఘటనలో ఆరు గొర్రెలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటాయని బాధితుడు తెలిపారు. ఈఘటనలో ఇంకొన్ని గొర్రెలు కూడా తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు.

కిష్టాపురంలో పూరిల్లు దగ్ధం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్2: విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం సత్తుపల్లి మండలం కిష్టాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన ధరావత్ పోతా నాయక్ పూరిల్లు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రూ.10వేల నగదు, వస్తువులు, అన్ని కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.60వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సత్తుపల్లి ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఎం.వెంకటేశ్వర్లు, వీరభద్రం, వెంకటేశ్వరరావు, రాజేందర్ ఉన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



పన్నారిషిని కుటుంబ సభ్యులకు అప్పిగాస్తున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 2: బీహార్ రాష్ట్రం కతిహార్ జిల్లా కొరహ గ్రామానికి చెందిన పన్నా రిషిని మంగళవారం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు. 30 ఏళ్ల క్రితం మతిస్థిమితం లేక బీహార్ నుంచి ఖమ్మం చేరుకోని నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు నగరంలోని అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించి ఆ వ్యక్తిని అన్నం ఫౌండేషన్లో చేర్పించారు. వైద్య సేవల అనంతరం మా ములు మనిషిగా మారిన వ్యక్తి నా పేరు పన్నారిషి, మాది బీహార్ రాష్ట్రం కతిహార్ జిల్లా కొరహ గ్రామం అని తెలపడంతో ఆ వివరాల ప్రకారం ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అం దించారు. దీంతో మంగళవారం అర్బన్ పోలీస్ స్టేషన్ పోలీసుల సమక్షంలో ఆయన భార్య కిరణ్ దేవ్, కుటుంబ సభ్యుల సమక్షంలో అతడిని అప్పగించారు. ఖర్చుల నిమిత్తం రూ.25 వేల అందించారు. పన్నారిషి కుటుంబ సభ్యులు అన్నం శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బూర్గంపాడు చెక్ పోస్టులో మందు పార్టీ

బూర్గంపాడు/మణుగూరు, ఏప్రిల్ 2: మద్యం నగదు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులోనే మందు పార్టీని ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బూర్గంపాడు శివారులో ఉన్నతాధికారులు అంతరాష్ట్ర చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులను నియమించారు. అయితే సోమవారం రాత్రి ఈ చెక్‌పోస్టులో ఒక పోలీసు అధికారి మరి కొందరితో కలిసి మందు పార్టీ చేసుకుంటూ కనిపించాడు. దీనిని కొందరు వీడియోలు తీశారు. ఈ క్రమంలో వీడియో తీసే ఫోన్‌ను సదరు అధికారి లాక్కునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

సైబర్ బాధితులకు అందుబాటులోకి మెరుగైన సేవలు

● ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్ బాధితులకు అందుబాటులోకి మెరుగైన సేవలు అందుతాయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో సైబర్ నేరాల కట్టడికి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌లో సైబర్‌నేరాల పట్ల ప్రత్యేక శిక్షణను పొంది సైబర్ వారియర్స్‌గా నియమించబడిన సిబ్బందికి ఫోన్లు, సిమ్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక సైబర్‌వారియర్ చొప్పున 28మందిని నియమించడం జరిగిందన్నారు. సైబర్ వారియర్స్‌గా శిక్షణ పొంది పోలీస్‌స్టేషన్‌లో పని చేసే సిబ్బందికి ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఉంటుందని,సైబర్‌నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930కి, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులవవుతుందని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడిన ఫిర్యాదు చేసిన బాధితుడికి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో నియమించబడిన సైబర్‌వారియర్ ద్వారా తమ అప్లికేషన్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్ క్రైమ్స్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జితేందర్, సైబర్ సెల్ సభ్యులు శ్రావణ్, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.



ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

విద్యార్థులకు అర్థమయ్యేలా గణితం బోధించాలి

● భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఏప్రిల్ 2: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేరీతిలో గణితం బోధించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ గణితం ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఐటీడీఏ కాన్ఫరెన్సు కార్యాలయంలో వేదిక్ గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయ న పాల్గొని మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు గణితశాస్త్రంలో ఫెయిల్ కాకుండా, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని వారికి సులభపద్దతిలో సుత్రాలను తెలియజేయాలని అన్నారు. కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు గురించి తెలియజేయడమే కాక ముఖ్యంగా టేబుల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేదిక్ గణితం ద్వారా భయాన్ని పోగొట్టాలని అందుకు ఆశ్రమ పాఠశాలల్లోని సహచర ఉపాధ్యాయులు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

ప్రభుత్వ వైఫల్యంతోనే చంద్రాయపాలెం ఘటన

● సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు

సత్తుపల్లి, ఏప్రిల్2: సత్తుపల్లి మండలం బుగ్గపాడు, చం ద్రాయపాలెం గ్రామాల గిరిజనుల మధ్య భూవివాదం ఏళ్ల తరబడి కొనసాగుతున్నా దానిని సమన్వయంతో పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని నీలం రామచంద్రయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల మధ్య ఉన్న భూవివాదాన్ని పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం వలన సమస్య జఠిలమైందన్నారు. పోలీసులు సరైన పద్ధతిలో వ్యవహరించకపోవడం వలన చంద్రాయపాలెంలో ఘటన జరిగిందని ఆరోపించారు. సత్తుపల్లి పట్టణ సీఐ సమన్వయంతో వ్యవహరించకపోవడం, సివిల్‌లో అక్కడికి వెళ్లి ఏకపక్షంగా అక్కడి గిరిజన యువకుడి సెల్‌ఫోన్ లాక్కొని దురుసుగా ప్రవర్తించడం వలన సంఘటన జరిగిందన్నారు. దానిని ఆసరగా తీసుకున్న పోలీసులు పెద్ద సంఖ్య లో అమాయక గిరిజనులపై తీవ్రంగా కొట్టారని, మహిళలపై దాడిచేసి గాయపరిచి చిన్న పిల్లల తల్లులను సైతం అరెస్ట్ చేశారని అన్నారు. ప్రభుత్వం, పోలీసు అధికారులు గిరిజనులను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల మధ్య భూవివాదాన్ని కొందరు స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని పేర్కొన్నారు. చంద్రాయపాలెం, బుగ్గపాడు గిరిజనుల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిని అటవీ, రెవెన్యూ శాఖలు సమష్టిగా సర్వే నిర్వహించి, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంటా శ్రీనివాసరావు, అమర్లపూడి శరత్, కొర్సా వెంకటేష్, నడికుదురుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

'ఐటీడీఏ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి'

భద్రాచలం, ఏప్రిల్ 2: గిరిజనులు ఐటీడీఏ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా శిక్షణ కలెక్టర్లు యువరాజ్ మర్మట్, మాయాంక్ సింగ్‌లు అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీ, గిరిజన మ్యూజియం, జీసీసీలో సబ్బులు, షాంపులు, తయారీ, గిరిజన గురుకుల పాఠశాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైటీసీ ద్వారా శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగం కల్పించి వారి జీవనోపాధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు ఐటీడీఏ పీవోతో కలిసి యూనిట్ ఆఫీసర్లు, భారతి రూరల్ ఫుడ్స్ ఫౌండేషన్ ఢిల్లీ వారు గిరిజన రైతులను అభివృద్ధిలోకి తేవడానికి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో, ఐటీడీఏ అధికారులతో కలిసి సమీక్ష సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ పాఠశాలలను ఉమ్మడి ఖమ్మం జిల్లా శిక్షణ కలక్టర్లు మాయాంక్‌సింగ్, యువరాజ్ మరమట్‌లు మంగళవారం సందర్శించారు. గురుకులం ఆర్సీవో వెంకటేశ్వరరాజు, ఏటీడీవో నర్సింహారావు, హెచ్‌ఎం నాగమణి, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ వీరన్నలు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మ్యూజియాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

● ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

చింతకాని ఏప్రిల్ 2: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నమ్మిన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే సీఎం రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. అకాల వర్షాలు, సాగు నీటి కొరతతో పంటలు పాడైపోయి అప్పుల్లో కూరుకొనిపోతున్నారన్నారు. జిల్లా నాయకులు కుటుంబ సభ్యులు పదవుల కోసం పాకులాడుతూ పాలనను విస్మరించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను పూర్తి చేసి పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. ప్రస్తుత ఎంపీ నామా నాగేశ్వరరావు రాష్ట్ర విభజన బిల్లుపై లోక్‌సభలో మెదటి ఓటు వేసి, విభజన చట్టంలోని హామీల అమలుకు కేంద్రంపై పోరాటం చేశాడన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వద్దిరాజు రవిచంద్ర, కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజు, పుల్లయ్య, కిషోర్, హనుమంతరావు, వెంకటరామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 2: ఇరువురిపై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాండ్లగూడెం గ్రామంలో గత నెల 27న ఓ వివాహ వేడుకలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో మాంసం విషయంలో ఘర్షణ జరిగింది.

ఘటనలో గ్రామానికి చెందిన జర్పుల హరికృష్ణ, అతని సోదరి దేవిపై అదే గ్రామానికి రాంబాబు, సుక్రు, స్వాతి, రవి, కళ్యాణి, మాలోతు ఆలీబాబు దాడి చేసి గాయపరిచారు. బాధితురాలు దేవి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ వివరించారు.

ముస్లిం ఉపాధ్యాయులకు టెన్త్ స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 2: నేటి నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి స్పాట్ వ్యాల్యూయేషన్ నుంచి రంజాన్ పండగ సందర్భంగా ఉపవాసంలో ఉన్న ముస్లిం ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాలు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రాలు అందించారు. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వాళ్లు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు కూడా మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకన్న, పీఆర్‌టీయూ సంఘం నుంచి జిల్లా నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, శేఖర్‌రావు, సునీత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మాదవరావు మృతదేహం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్2: ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సత్తుపల్లి మండలం తాళ్లమడ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంసూరు మండలం దుద్దేపూడికి చెందిన జుంజునూరు పెద్ద మాధవరావు (48) తోటి కూలీలతో కలిసి వరిగడ్డి ట్రాక్టర్‌పై తాళ్లమడ నుంచి వెళ్తున్నాడు. అదేసమయంలో అశ్వారావుపేట వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న అతడు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ దెబ్బతో మహిళ...



వినోద

టేకులపల్లి, ఏప్రిల్ 2: భద్రాద్రి జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలోని టేకులపల్లి మండలం మొక్కంపాడుతండాకు చెందిన బానోతు వినోద(40) వడదెబ్బతో మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై ఇంటివద్దనే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాముకాటుతో రైతు..



శివ

పెనుబల్లి, ఏప్రిల్ 2: పాముకాటుతో యువ రైతు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పార్థసారథిపురంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. పార్థసారథిపురం గ్రా మానికి చెందిన కుంజా శివ(25) సోమవారం రాత్రి వరిపొలంలో మోటారు వేసేందుకు వెళ్లగా పొలంలో పాము కాటు వేసింది. శివ ఎంతసేపటికి ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని గమనించి, కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి కుంజా రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం పట్టివేత

దమ్మపేట, ఏప్రిల్2: మండలంలోని నాగుపల్లిలో బెల్టు షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఎఫ్ఎస్‌టీం, పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.8,700 ఉంటుందని ఎఫ్ఎస్‌టీం ఆఫీసర్ కృష్ణ, ఎస్ఐ సాయికిషోర్ రెడ్డిలు తెలిపారు.



ప్రజలు రక్షణ సూత్రాలు పాటించాలి: డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 2: ఎండల తీవ్రత నుంచి ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు కొన్ని రక్షణ సూత్రాలు పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష కోరారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాట్లాడారు. అధిక ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి మూడు గంటల మధ్య ఎండలో బయటకు రాకుండా ఉండాలని కోరారు. ఈ వేడికి ఆల్కాహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ శీతల పానియాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఎవరైన ఎండ దెబ్బకు గురైతే 108కి కాల్ చేయాలన్నారు. ఈ నెలలో ఎండల తీవ్రత అధికంగా ఉంటాయనే దృష్ట్యా ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. వడ దెబ్బ నివారణకు ప్రతి ఒక్కరు వైద్య శాఖ సూచనలు పాటించాలన్నారు. ప్రయాణించేటప్పుడు తాగు నీరు వెంట తీసుకెళ్లాలని, అదేవిధంగా ఓఆర్ఎస్ పానీయాలను కూడా తీసుకోవాలని సూచించారు.

ఎండలతో అల్లాడుతున్న ప్రజలు

శీతల పానీయాలకు డిమాండ్.. పెరిగిన ధరలు

నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 2: వేసవి ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంతోపాటు పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ, మణుగూరు, ఇల్లెందుల్లో పగటి ఉష్ణోగ్రత 42గా నమోదు అవుతుండటంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఒక వైపు ఎండలతోపాటు మరో వైపు శీతలపానియాల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ప్రారంభం కావడం... మధ్యాహ్న సమయంలో ఎండలు మరింత పెరగడంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యావసర పనుల కోసమే ప్రజలు బయటకు వస్తున్న పరిస్థితి ఏర్పడుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండ త్రీవంగా ఉండటంతో మే నెలలో ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులకు ఒంటిపూట బడులు కొనసాగుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్న స్థితి నెలకొంది. వీధి వ్యాపారులు చేసుకునే చిరు వ్యాపారులు సైతం ఎండ తీవ్రతకు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్నప్పటికీ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణానికి జిల్లా నలుమూలల నుంచి వివిధ అవసరాల నిమిత్తం వేలాది మంది వస్తుంటారు. వారికి అవసరమైన మంచినీటిని అందించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తోన్నాయి. కొత్తగూడెం పట్టణంతోపాటు సమీప ప్రాంతాల్లో కొబ్బరిబొండాల దుకాణాలు, చెరుకు రసం బండ్లు, జ్యూస్ స్టాల్స్ నిమ్మకాయ సోడా బండ్లు పెరిగిపోతున్నాయి. ప్రజలు సైతం ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని పానీయాలపై ఆసక్తి చూపుతుండటంతో వాటి ధరలు భారీగానే కొనసాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. సింగరేణి కాలరీస్ పరిధిలోని ఓపెన్ కాస్టుల్లో ఎండ తీవ్రత మరింత అధికమవుతోంది. ఏప్రిల్, మే నెలలో ఎండలు అధికంగా ఉండే అవకాశాలు ఉండటంతో సింగరేణి అధికారులు కార్మికులకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు. రెండో షిఫ్టు వెళ్లే కార్మికులు ఎండలతో ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది.





నిర్మానుష్యంగా ఉన్న 'గూడెం' ప్రధాన వీధులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి



సుజాతనగర్‌లో నిర్వహించిన ర్యాలీ

మణుగూరు, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మణుగూరు మండల పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక కార్యాలయ సిబ్బందితో పాటు స్త్రీ శక్తి సిబ్బంది ప్రదర్శనగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం పట్టణ ప్రాంతంలో మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాసామ్య వ్యవస్థలో ఓటు ఎంతో ప్రాముఖ్యత గలదని ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోను కాకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో పల్నాటి వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం అహ్మద్దుల్లా సిబ్బంది పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సుజాతనగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి తలుగు వెంకటలక్ష్మీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్వీప్ - 2024 (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) లో భాగంగా ఓటు హక్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్ల కార్డ్స్ చేతబూని ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... ఓటు వజ్రాయుధం లాంటిదని, దేశ ప్రగతిని శాసించే నాయకులను ప్రజాస్వామ్యయుతంగా మనమే మన ఓటు హక్కు ద్వారా ఎన్నుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎలక్షన్ స్పెషల్ ఆఫీసర్ వెంకయ్య, ఏపీఎం మీరాబీ, సెక్రటరీ బినరేంద్రప్రసాద్, వీవోఏలు ఏలూరి మాధవి, మండే అరుణ, సౌజన్య, విజయనిర్మల, ఎఫ్ఏ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పినపాకలో..

పినపాక: ఎంతో మంది పోరాట ఫలితంగా ఓటు హక్కు సాధించామని ఓటు హక్కు ద్వారా ప్రజలే పాలకులు అవుతారని పినపాక ఎంపీడీవో రామ కృష్ణ అన్నారు. మంగళవారం ఓటుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పినపాక క్రాస్ రోడ్ వరకు స్త్రీ శక్తి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఓటు వజ్రాయుధం అంటూ ఓటును అమ్ముకోవద్దు అంటూ నినాదాలు చేశారు. ఓటు విలువలను తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు వజ్రాయుధం వంటిందని అన్నారు. ఓటు వేయడం ద్వారా మన నాయకుడిని మనమే ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి, ఏపీవో వీరభద్రస్వామి, ఐకేపీ వీవోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న తాటి

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 2: ఎండల తీవ్రత నేపద్యంలో అశ్వారావుపేట వ్యాప్తంగా ప్రభుత్వ పరంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తాగునీటితో పాటు రాగి జావ కేంద్రాలు సైతం ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు సంపూర్ణ, దిశ కమిటీ సభ్యులు నారం రాజశేఖర్, యువజన విభాగం అధ్యక్షులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు గురికావొద్దు: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 2: జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు ఎండ తీవ్రతకు గురికాకుండా అన్ని రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ మినీ సమవేశ మందిరం నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ మీటింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపద్యంలో అన్ని ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధిహామి పథకం పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలు ఎండ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పని వేళలు సైతం ఉదయం 6 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిర్వహించాలన్నారు. రానున్న రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు సిద్ధం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జనసాంద్రత ఉన్న ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 17వ తేదీన భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవం ఉన్నందున భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. అందుకు తగినట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ శాంతి

మణుగూరు, ఏప్రిల్ 2: ప్రతీ రోజు సైబర్ నేరాలు ఏదో ఓ ప్రాంతంలో జరుగూతూనే ఉన్నాయని, ప్రజలు సైబర్ నేరాల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని మణుగూరు పోలీసులు మంగళవారం ప్రజలకు అవగాహణ కల్పించారు. ఏఎస్ఐలు నిజాముద్దీన్ అలీ, శాంతి మాట్లాడుతూ.. సైబర్ నేరాలు క్షణాల్లో జరిగిపోతున్నాయని తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన బ్యాంకు అకౌంట్ నెంబర్లు ఫోన్‌ల ద్వారా ఇతరులకు ఎవ్వరికీ తెలపరాదని, బ్యాంకు వాళ్లమని ఫోన్ చేసినా సమాచారాలను ఫోన్లలో చెప్పవద్దని సూచించారు. అలాగే ఓటీపీ వివరాలను ఫోన్ చేరిన వారికి చెబితే బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు ఖాళీ అయిపోతున్నాయని తెలిపారు. ఏటీఎం కార్డు నెంబర్లు, ఆధార్ నెంబర్లు కూడా పరాయి వ్యక్తులకు ఏమాత్రం తెలుపవద్దని ప్రజలకు అవగాహణ కల్పించారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పై కనీసం అవగాహణ పెంచుకుని మీమీ గ్రామాల్లో పరిసర ప్రాంతాల ప్రజలకు తెలపాలన్నారు.

సతీష్ మృతి బాధాకరం కొత్వాల

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 2 : మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఆకుల సతీష్ మృతి బాధాకరమని డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సతీష్ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కొత్వాల వెంగళరావు కాలనిలోని సతీష్ స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దుమ్ముగూడెం, ఏప్రిల్ 2: పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి రవాణా చేస్తున్న నలుగురిపై సీఐ బొడ్డు అశోక్ మంగళవారం కేసు నమోదు చేశారు. వారి నుంచి ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నారు. కాటాయిగూడెంకు చెందిన మహమ్మద్ అజారుద్దీన్ మహదేవపురం గ్రామస్థుల నుంచి మూడున్నర క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రూ.10 చొప్పున కొనుగోలు చేసి ములకపాడుకు చెందిన బాబి అలియాస్ రామకృష్ణ సహాయంతో ఏపీ రాష్ట్రం చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన అస్గర్‌కు సరఫరా చేస్తున్నాడు. అలాగే ఏపీ రాష్ట్రం లక్ష్మీపురానికి చెందిన కట్ట కార్తీక్ దుమ్ముగూడెం మండలం భీమవరం గ్రామస్థుల నుంచి మూడున్నర క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేసి చట్టి గ్రామానికి చెందిన అస్గర్‌కు సరఫరా చేస్తున్నాడు. నలుగురిపై కేసు నమోదు చేశారు.

ఖమ్మం పార్లమెంట్‌లో గులాబీ జెండా ఎగరాలి

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి నామా

ములకలపల్లి, ఏప్రిల్ 2: నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మంలో గులాబి జెండా ఎగిరేలా కృషి చేయాలని ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, పార్లమెంటరీ లోక్‌సభపక్ష నేత నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని జగన్నాధపురం పంచాయతీ సర్పాపురంలో కోట మైసమ్మ ఆలయ ఆవరణలో అశ్వారావుపేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, సండ్ర వెంకట వీరయ్యలతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనపై నమ్మకం ఉంచి ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా తిరిగి టిక్కెట్ కేటాయించడం జరిగిందని, గతంలో మాదిరిగానే తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపి బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు సున్నం నాగమణి, కొనకళ్ల వెంకటరెడ్డి, లావణ్య, ఎంపీపీలు మట్ల నాగమణి, జ ల్లిపల్లి శ్రీరామమ్మూర్తి, ఒగ్గెల పూజ, భూక్యా ప్రసాద్, ప్రకాష్, మండల అధ్యక్షులు మోరంపూడి అప్పారావు, దారా బాబు, నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

భక్తులకు అసౌకర్యం కలగకుండా నవమి ఏర్పాట్లు

భజన మందిర రామాలయ ఈవో సుదర్శన్

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 2: ఈ నెల 17న శ్రీ రామనవమి సందర్భంగా నిర్వహించే సీతారామ చంద్రస్వాముల వారి కల్యాణం నేపథ్యంలో హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని భజన మందిరం ఆలయ ఈవో సుదర్శన్ అన్నారు. నవమి ఏర్పాట్లపై మంగళవారం భజనమందిర శ్రీరామాలయంలో వర్తక సంఘ ప్రముఖులు, భక్త బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు సుమారు 20వేల మంది వరకు భక్తులు హాజరవుతారని అంచనా నేపథ్యంలో అందుకు తగినట్లుగా స్వామివారి దర్శనానికి, కల్యాణం తిలకించేందుకు మంచినీటి సౌకర్యం, ప్రసాదం పంపిణీ వంటి ఏర్పాట్లపై గతంలో చేసిన విధంగా ఈ దఫా ఏర్పాట్లు జరగాలని ఆయన సూచించారు. కల్యాణాన్ని తిలకించడానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వర్తక సంఘ కన్వీనర్ చలువాది ప్రకాష్, బచ్చు శ్రీనివాస్, దోమల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు గోపాల కృష్ణమాచార్యులు, లక్ష్మీపతి, ఆరెంజ్ శ్రీనివాస్, అపో లో ప్రకాష్, గర్రె శివ, కంతాల వెంకన్న, ఉప్పుశెట్టి రాజేష్, గడ్డం గుర వయ్య, గుబ్బ దుర్గ, ఆలయ సిబ్బంది కాశి, శివ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవో సుదర్శన్

కొత్తగూడెం ఏరియా జీఎంకు సన్మానం



జీఎం షాలెం రాజును సన్మానిస్తున్న దృశ్యం

రుద్రంపూర్, (సింగరేణి), ఏప్రిల్ 2: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేసిన కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజును మంగళవారం కార్మికసంఘాల ప్రతినిధులు సన్మానించారు. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షులు ఎండి. రజాక్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం రికార్డు సృష్టించిందన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా సాధ్యమైందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ నూతన ఫిట్ కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఆల్బర్ట్, కల్వ నాగభూషణం, రాజేశ్వరరావు, చెన్న కేశరావు, కుమార స్వామి, చిల రాజయ్య, సకినాల సమ్మయ్య, లెనిన్ బాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

తాళ్లూరి అప్పారావు ఆదర్శవంత నాయకుడు

సంస్మరణ సభలో వక్తలు



మాట్లాడుతున్న పోటు రంగారావు

బూర్గంపాడు / మణుగూరు, ఏప్రిల్ 2: భద్రాచలంలో టీఎన్‌టీయూసీ స్థాపించడంలో కీలక పాత్ర పోషించి, సంఘ ఎన్నికల్లో యూనియన్ గెలుపునకు విశేష కృషి చేసిన తాళ్లూరి అప్పారావు ఆదర్శవంత నాయకుడని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన అప్పారావ సంస్మరణ సభ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర నేత పోటు రంగారావు మాట్లాడుతూ మంచి విలువల గల కార్మికనేత లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్మిక పక్షాన నిలిచి యూనియన్ స్థాపనకోసం, కార్మిక సంక్షేమం కోసం పాటు పడిన వ్యక్తి అప్పారావు అని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో నాటి నాయకులు పాకాలపాటి దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు సత్యనారాయణ, కేవీఆర్, గల్లా నాగభూషయ్య, గుర్తింపు సంఘ నాయకులు కనకమేడల హరిప్రసాద్, గాదే రామకోటి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణ

చుంచుపల్లి, ఏప్రిల్ 2: వంద మంది ఎస్సీ విద్యార్థులకు గ్రూప్స్ -1, 2, 3 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశం నిరుద్యోగ అభ్యర్థులు వినియోగించుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు చివరి తేదీ ఈ నెల 5వ తేదీన నిర్ణయించినట్లు తెలిపారు. అడ్మిషన్లు పొందే నిరుద్యోగ అభ్యర్థులు గ్రాడ్యుయేట్‌లో బీఏ, బీఎస్సీ, బీకాం, బీటెక్, బీఎస్సీ అగ్రికల్చర్, బీఫార్మసీలో ఉత్తీర్ణులై ఎస్సీ అభ్యర్థులు అర్హులన్నారు. ఆదాయం రూ. 3 లక్షలు మించరాదని, ఒక సంవత్సరంలోపు తీసుకున్న ఆదాయ ధృవీకరణ పత్రాన్ని అందజేయాలని ఆమె కోరారు.

రాజుపేట సమస్యలు పరిష్కరించాలి

మణుగూరు, ఏప్రిల్ 2: మునిసిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సత్రపల్లి సాంబశివ రావు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా రాజుపేట గ్రామంలో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారికి సింగరేణి ఓసీ బ్లాస్టింగ్‌లు అనేక ఇబ్బందుకు గురి చేస్తున్నాయని తెలిపారు. నివాసాలు అన్ని బ్లాస్టింగ్ దెబ్బలకు బీటలు వారిపోతున్నాయని, పైన ఉన్న రేకులు పగిలిపోతున్నాయని తెలిపారు. విపరీతమైన దుమ్మూ ధూళి ఎగసి గ్రామంపై పడటం వల్ల పరిసరాలు ప్రజల ఆరోగ్యాలు పాడైపోతున్నాయన్నారు. సింగరేణి నిర్వాసిత గ్రామంగా రాజుపేటను గుర్తించి సింగరేణి తరఫున నష్టపరిహారం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు..



ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతున్న అటవీ సిబ్బంది

అశ్వాపురం, ఏప్రిల్ 2: అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అశ్వాపురం, బూర్గంపాడు మండలాల పరిధిలో మండు వేసవిలో మూగజీవాలు, వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం అశ్వాపురం ఫారెస్ట్ రేంజర్ ఎస్.రమేష్ పర్యవేక్షణలో బీట్ అధికారులు అడవుల్లో ఏర్పాటు చేసిన నీటితొట్లలో ట్యాంకర్ల సహాయంతో నీటిని నింపారు. వన్యప్రాణులు దాహార్తితో మృత్యువాత పడకుండా ఫారెస్ట్ అధికారులు నీటితొట్లను నీటితో నింపుతున్నారు.

ఉదయం పూటే విధులు పూర్తి చేయండి: డాక్టర్ మణిదీప్

దమ్మపేట, ఏప్రిల్ 2: వేసవి దృష్ట్యా ఆశా వర్కర్లు ఉదయం పూటే తమ విధులు పూర్తి చేయాలని ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ మణీదీప్ సూచించారు. అశాడే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆశాలు వేసవిలో తీసుకోవాల్సిన చర్యపై డాక్టర్ మణిదీప్ పలు సూచనలు చేసారు. ప్రతీ ఆశావర్కర్ ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో వుంచాలని ప్రజలకు, రైతులకు, కూలీలకు వేసవి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కలిపించాలన్నారు. అదేవిధంగా రైతులు, కూలీలు ఉదయం 11గంటల కల్లా వ్యవసాయపనులు పూర్తి చేసుకోవాలని కోరారు. ఎండలో పని చేయటం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం వుందని అన్నారు. వడ దెబ్బకు గురైన వారికి ప్రాథమిక చికిత్స నిర్వహించి వైద్యశాలకు తరలించాలన్నారు. వడ దెబ్బకు గురైన వారికి వెంటనే చికిత్స అందించకపోతే మరణించే అవకాశం వుందన్నారు. ఆశాలు ప్రజలకు అందుబాటులో వుండాలన్నారు. ఎండ నుంచి తీసుకోవాల్సిన చర్యలపై ఆశా కార్యకర్తలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ రామారావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మణిదీప్

వడదెబ్బ తగలకుండా జాగ్రతలు పాటించాలి

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 2: వేసవి కాలంలో ప్రజలు వడ దెబ్బ ప్రమాదానికి లోనుకాకుండా తగు జాగ్రతలు పాటించాలని రొంపేడు ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు కవిత సూచించారు. మంగళవారం రొంపేడు పీహెచ్‌సీలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతంలో గిరిజనులు ఎండను లెక్క చేయకుండా కూలీ పనులు చేస్తూ వడదెబ్బకు గురవుతున్నారని, వారికి తగు జాగ్రత్తలతో కూడిన సూచనలు చేయాలని ఆశ కార్యకర్తలను కోరారు. పనులకు వెళ్లే ప్రజలు ఓఆర్ఎస్ ప్యాకట్‌లను వెంట ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ భద్రు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణంరాజు, అమరవతి, పెండకట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.